ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 24 నవంబరు 2024



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఒలింపిక్స్‌లో గ్రామీణ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించాలి

- అంతర్జాతీయ జిమ్నాస్ట్ బుద్ధ అరుణరెడ్డి
- జేఎన్‌ఎస్‌లో అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు
- వాలీబాల్ విజేత పడిగాపూర్, త్రోబాల్ విజేత కమలాపూర్ జట్లు

8



చలికాలంలో వాకింగ్!



జనగామ జిల్లా రఘునాథపల్లిలో వాకింగ్ చేస్తున్న గ్రామస్థులు

- దీర్ఘకాలిక వ్యాధులకు దివ్యౌషధంలా నడక
- మిగిలిన రోజుల్లో కన్నా ఇప్పుడే ఎక్కువ అవసరమంటున్న నిపుణులు
- అసోసియేషన్లుగా ఏర్పడుతున్న వాకర్లు
- ఆరోగ్యంతో పాటు పొదుపుపైనా దృష్టి

8

సండే స్పెషల్ SUNDAY SPECIAL

నిత్యం ఉదయాన్నే వాకింగ్ చేయడమనేది సర్వ రోగ నివారిణి అని.. సంపూర్ణ ఆరోగ్యానికి కీలక సూత్రమని అందరికీ తెలుసు. అందుకే గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా రోజూ తెల్లవారుజామున అరగంట నుంచి గంట పాటు వాకింగ్ చేయడం అనేక మందికి అలవాటు. 'నడక'పైనే ఆరోగ్య జీవన నడవడిక ఆధారపడి ఉందన్న విషయాన్ని గ్రహిస్తున్నారు. ఫలితంగా మార్నింగ్ వాక్ చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎండాకాలం, వానాకాలం, చలికాలం అనే తేడా లేకుండా యువత నుంచి వృద్ధుల వరకు వాకింగ్, వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకుంటున్నారు. అయితే మిగతా కాలాల మాటెలా ఉన్నా.. చలికాలంలో మాత్రం నడకవల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో తేమ శాతం మూలంగా బిగుసుపోయిన కండరాల్లో ఉత్తేజం నింపుతుందని, రోజంతా శరీరం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేలా చూస్తుందని చెబుతున్నారు.

- రఘునాథపల్లి, ఆంధ్రజ్యోతి





నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

పోలీసు వ్యవస్థ దిగజారిపోయింది..

- కాంగ్రెస్ నేతలు, పోలీసుల అక్రమాలపై ఆధారాలున్నాయి..
- నర్సంపేటలో శ్రేణులకు పార్టీ అండగా ఉంటుంది..
- బీఆర్‌ఎస్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని బీఆర్‌ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసుల చర్యలు హద్దులు మీరుతున్నాయని, ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించడం లేదన్నారు. మునిసిపాలిటీలో, గ్రామాలు, తండాల్లో భూతగాదాలలో పోలీసుల జోక్యం పెరిగిందన్నారు. అమాయకులపైన.. ముఖ్యంగా గిరిజనులు, దళితులు, బలహీనవర్గాలపైన పోలీసులు ఏకపక్షంగా కేసులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపైన అక్రమ కేసులు పెడుతున్న ఎస్‌ఐ, సీఐలను గుర్తించామని, వారికి దీటుగా మండల పార్టీలు పనిచేయాలన్నారు. అవినీతి, అక్రమాలపై రాష్ట్రస్థాయి ఏజెన్సీలను సంప్రదించి న్యాయపోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ కమిషన్లతో పాటు హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేయడానికి బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ అడ్వకేట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. అధికార పార్టీ నేతలు, పోలీసులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే పోలీసుస్టేషన్ల ముందు నిరసనలు, ధర్నాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కేసులకు భయపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. లగచర్ల బాధితులకు అండగా ఈ నెల 25న మహబూబాబాద్‌లో జరిగే బీఆర్‌ఎస్ సభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 29న కేసీఆర్ దీక్షా దివస్‌ను నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గోనె యువరాజు, మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, హింగె మురళీధర్ రావు, బండి రమేశ్, బానోతు సారంగపాణి, బాల్నె వెంకన్న, వెంకట నర్సయ్య, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే అభివృద్ధికి వేగంగా అడుగులు
- కాజీపేట రైల్వేస్టేషన్‌కు డివిజన్ హోదా ఇచ్చేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- కాజీపేటలోనే కోచ్ ఫ్యాక్టరీకి ఏర్పాటుకు ఇప్పటికే అనుమతి
- వేగంగా వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు
- కొత్త రైల్వే మార్గాలకు నిధులు విడుదల చేసిన కేంద్రం
- నూతన రైల్వే కనెక్టివిటీతో పెరగనున్న రవాణా సౌకర్యం



8


ఓరుగల్లు రైలు యమ స్పీడు

రైల్వే మార్గాల పెంపు, ఫ్యాక్టరీల ఏర్పాటు, డివిజన్‌కు రూపకల్పన, వ్యాగన్ల తయారీలతో ఓరుగల్లులో రైల్వే అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇన్నాళ్లు రైల్వే విషయంలో వెనుకబడి ఉన్న ఓరుగల్లుకు ఇక మహర్దశ పట్టనుంది. రైల్వే శాఖకు సంబంధించి పలు అభివృద్ధి పనులను కాజీపేట జంక్షన్ కేంద్రంగా చేయబోతున్నారు. ఇందులో ముఖ్యంగా కాజీపేట రైల్వే డివిజన్‌కు మార్గం సుగమమైంది. విశాఖ జోన్ ఏర్పాటుకాబోతున్న తరుణంలో దక్షిణ మధ్య రైల్వేలో అతి ముఖ్యమైన కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా మార్చబోతున్నారు. ఈ మేరకు అధికారులు హద్దులను నిర్ణయించే పనిలో ఉన్నారు. అలాగే కోచ్ ఫ్యాక్టరీ పనులు వేగంగా జరుగుతున్నాయి. కాజీపేట జంక్షన్‌లో ఇప్పటికే డీజిల్ లోకోషెడ్స్, ఎలక్ట్రిక్ లోకోషెడ్స్ ఉండగా, వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. రూ.521కోట్ల వ్యయంతో 160 ఎకరాల్లో నిర్మితమయ్యే ఈ ఫ్యాక్టరీకి కిందటేడు జూలై 8వ తేదీన ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. యేడాదిలోగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే కొత్త రైల్వే మార్గాల రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ పనులతో కాజీపేట జంక్షన్‌కు మంచిరోజులు రాబోతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్















వరంగల్ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

మహారాష్ట్ర విజయం మోదీ చరిష్మాకు నిదర్శనం

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

మిల్స్‌కాలనీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించడం ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాకు నిదర్శనమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని పురస్కరించుకొని వరంగల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి ఉన్న పాపులారిటీ ఏ మాత్రం తగ్గలేదని మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు మరోమారు రుజువు చేశాయన్నారు. మోదీ పాలనలో భారత్ అంతర్జాతీయ ఖ్యాతిని గడించిందన్నారు. మహారాష్ట్ర ప్రజలు సరైన నిర్ణయం తీసుకొని బీజేపీ కూటమిని గెలిపించారన్నారు. పేదరికం, అవినీతి, ఉగ్రవాదంలాంటి పీడల నుంచి విముక్తి పొందిన నవభారత నిర్మాణం కోసం యజ్ఞం చేస్తున్న భరతమాత ముద్దుబిడ్డగా మోదీని ఆయన అభివర్ణించారు. సీఎం రేవంత్‌రెడ్డి మోదీపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఇప్పుడు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యవర్గంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, జిల్లా ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల కనుకుంట్ల రంజిత్‌కుమార్, ఎరుకల రఘునారెడ్డి, మాచర్ల దీన్‌దయాళ్, నాయకులు మురళీకృష్ణ, వెంకటేష్, సూరజ్ పాల్గొన్నారు.



26న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న హనుమకొండ జేఎన్ఎస్ సింథటిక్ ట్రాక్‌పై జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8, 10, 12, బాలబాలికల 50, 100, 300, 400, 600, మీటర్ల పరుగు పందెం, కిడ్స్ జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, క్రీడాంశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు డిసెంబరు 1 నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి అర్హత కలిగిన క్రీడాకారులు ఈనెల 26 ఉదయం 9 గంటలకు హనుమకొండ జేఎన్ఎస్‌లో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు మరిన్ని వివరాలకు 9866564422 నెంబర్‌లో సంప్రదించాలని యుగేందర్‌రెడ్డి తెలిపారు.

కేయూ సౌత్ జోన్ మహిళా జూడో జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ జూడో మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య శనివారం తెలిపారు. ఎంపికైన వారిలో వరంగల్ వెస్ట్ టీఎస్ డబ్ల్యూఆర్‌డీసీ విద్యార్థులు కె. అనూష, డి.ప్రగతి, డి.బేబిలత, నక్షత్ర, టీటీడబ్ల్యూఆర్ డీసీ కొత్తగూడెం టి.చంద్రకళ, పి.నాగలక్ష్మిలు పాల్గొనున్నారు. ఈ జట్టుకు వరంగల్ వెస్ట్ టీడబ్ల్యూఎస్ ఆర్‌డీసీ ఉమెన్స్ కళాశాల పీడీ బి.జ్యోతి కోచ్, మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన క్రీడాకారులను వర్సిటీ ఉన్నాధికారులు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ వెంకయ్య

నేడు జీఎన్ సాయిబాబా సంస్మరణ సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఘంటా రామారెడ్డి

వడ్డేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభ ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరుగుతుందని ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఘంటా రామారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎం.వెంగళ్‌రెడ్డి తెలిపారు. శనివారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామిక, వామపక్ష, లౌకికవాదుల, ప్రజా సంఘాల ఐక్యవేది క ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వీక్షణం పత్రిక సంపాదకుడు ఎన్.వేణుగోపాల్, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, సాయిబాబా కుమార్తె జీఎన్. మంజీర, మా భూమి సంధ్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సంస్మరణ సభలో వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈసమావేశంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక బాధ్యులు డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, డాక్టర్ ఎండీ రాజ్‌మహ్మద్, ఎస్.ఓంబ్రహ్మం, సాయిని నరేందర్, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలి

30వ తేదీ వరకు వివరాల నమోదు పూర్తి కావాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే) వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం సర్వే వివరాలను డేటా ఎంట్రీ చేయడంపై ఎంపీడీఓలు, ఎంపీఓ, ఎంపీఎస్‌ఓలతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఈనెల 30వ తేదీవరకు నమోదు పూర్తి చేయాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎన్యూమరేటర్ కలిసి సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నమోదు చేసి సర్వే పత్రాలను భద్రంగా భద్రపరచాలన్నారు. సర్వే పత్రాల భద్రత విషయంలో సూపర్‌వైజర్లు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, ఈడీఎం, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంపీఎస్‌లతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఫుడ్‌సేఫ్టీ టీంను ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్‌లతో కూడిన ఫుడ్‌సేఫ్టీ బృందాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన శాంతికుమారి జిల్లాల కలెక్టర్‌లను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్‌లతో శనివారం శాంతికుమారి శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో మాట్లాడారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులు తదితర అన్ని సంస్థలలో ఆహారాన్ని అందించేందుకు ప్రమాణాలతో కూడిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా మల్టీ డిసిప్లినరీ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి రెండేళ్లలో ఫుడ్‌పాయిజన్ సంఘటనలు జరిగిన హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి సంఘటనలకు గల కారణాలను, సమస్యలకు పరిష్కారాలు చూపాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. భవిష్యత్‌లో హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌లను ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గురుకులంలో జడ్పీ సీఈవో తనిఖీ

హసన్‌పర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యం సాధ్యమని జడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. భీమారం తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాలయంలో శనివారం ఆమె అకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల విద్యాలయంతో పాటు కళాశాల విద్యార్థులకు అవసరమైన వసతులపై ఆమె ఆరా తీశారు. వంటగది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి చెందారు.

ఆమె వెంట ఏపీవో విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, స్టాఫ్ నర్సు రమ్య, మాధవి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



హనుమకొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నయీంనగర్ విశాల్‌వైన్స్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సీఐ సతీష్ తెలిపారు. మృతుడు సుమారు 45 నుంచి 50 ఏళ్ల లోపు ఉంటాడని, ముస్లిం మతానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు హనుమకొం డ పోలీస్‌స్టేషన్‌లో కానీ, 8712584486 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కమిషనరేట్ పోలీసులకు డీజీపీ ప్రశంసలు



డీజీపీ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కమిషనరేట్ పోలీసులు

హనుమకొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నియంత్రణతో పాటు వివిధ కేసుల్లో నేరస్థులకు పదేళ్లకుపైగా జైలు శిక్షపడటంలో కృషి చేసిన కమిషనరేట్ పోలీసులను రాష్ట్ర డీజీపీ జితేంద‌ర్‌రెడ్డి ప్రశంసించారు. శనివారం హైద్రాబాద్ పోలీస్‌శాఖ ప్రధాన కార్యాయలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, సంగెం ఎస్సై నరేశ్, పరకాల హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌కు డీజీపీ ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రశంస పత్రాలు అందుకున్న అధికారులను సీపీ ప్రత్యే కంగా అభినందించారు.

అనుమతి కొంత.. తవ్వుతున్నది 'కొండంత'

కనపర్తి గ్రానైట్ క్వారీల్లో వెలుగుచూస్తున్న అక్రమాలు

క్వారీలను పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు

ఐనవోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వనమాల కనపర్తి గ్రానైట్ క్వారీల్లో అక్రమాల లీలలు ఒకొక్కటి వెలుగుచూస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలకు గ్రానైట్ వ్యాపారులకు ఎంచేయాలో పాలుపోవడంలేదు. తీగలాగితే డొంక కదిలినట్లు అధికారుల క్షేత్రపరిశీలనలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టినట్లు స్పష్టమవుతోంది. శనివారం తహసీల్దార్ విక్రమ్‌కుమార్, మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ, గిర్దావర్ మల్లయ్యలు వనమాల కనపర్తి, కొండపర్తి శివార్లలోని 11 గ్రానైట్ క్వారీలను పరిశీలించారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 103లో తవ్వకాలకు అనుమతి (విస్తీర్ణం) కొంతైతే.. కొండంతా తవ్వకాలు చేపడుతున్నట్లు గుర్తించారు. క్వారీల నిర్వాహకులను హద్దులను చూపించాలని అధికారులు కోరగా, కొన్ని హద్దులు గుట్టపై, మరి కొన్ని వేస్టేజ్ బండరాళ్లలో ఉన్నట్లు చెప్పి నిర్వాహకులు దాటవేశారు. మైనింగ్ శాఖ నుంచి తీసుకున్న క్వారీల అగ్రిమెంట్, విస్తీర్ణం, నక్ష మ్యాప్‌ల పత్రాలను ఇవ్వాలని అధికారులు అడిగితే ఇవ్వడానికి వారు సిద్ధపడలేదు. అయితే క్వారీల అగ్రిమెంట్ అనుమతి పత్రాలు, మ్యాప్‌లను ఈనెల 25న తమకు సమర్పించాలని తహసీల్దార్ వారిని ఆదేశించారు. డ్యాంకుమెంట్లు పరిశీలించి తేడాలు ఉంటే సర్వేకు నోటీసులు అందించనున్నారు. రెవెన్యూ శాఖ సర్వేయర్, మైనింగ్ శాఖ సర్వేయర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో క్వారీల తవ్వకాల విస్తీర్ణం కొలతలు చేపడుదామని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు.

ఇదిలా ఉండగా కొండపర్తిలో కొనసాగుతున్న గ్రానైట్ క్వారీల భూమి, క్వారీల వివరాల అగ్రిమెంట్ పత్రాలను అధికారులకు నిర్వాహకులు ఇవ్వలేదు. ఈ క్వారీల విస్తీర్ణం సుమారు 10 ఎకరాల భూమి అసైన్డ్‌భూమి అని అధికారులు చెబుతుండగా.. పట్టాభూమి అని క్వారీ నిర్వాహకులు చెబుతున్నారు. అసైన్డ్ భూమిని లావణి పట్టాదారుల నుంచి తీసుకొని 2022లో ప్రైవేటు పట్టాభూమిగా మార్చుకున్నారని రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు గతంలో 2 పేజీల రిపోర్టును ఇచ్చినట్లు సమాచారం.

రెండు గ్రామాల్లోని క్వారీల్లో తవ్వకాల్లో జరుగుతున్న అక్రమాలపై రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే కోట్ల రూపాయల ప్రజాధనం ప్రభుత్వ ఖజానాకు చేరుకోవడమే కాకుండా అక్రమ తవ్వకాలకు బ్రేక్ పడుతుందని ప్రజలు కోరుతున్నారు. నామమాత్రపు రాయల్టీతో కోట్ల విలువచేసే గ్రానైట్‌ను తరలిస్తూ రెండు గ్రామాలను మట్టిదిబ్బలుగా మారుస్తున్నారని స్థానికులు వాపోయారు.

ఇక నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు

వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రారంభం

గిర్మాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్సిల్ సర్వీసులకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే శాఖ నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. పార్సెల్ బుకింగ్ లావాదేవీల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించిన అధికారులు.. వాటిని అధిగమించేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని 35 ప్రధాన రైల్వే పార్సిల్ కార్యాలయాల్లో ఈ తరహా చెల్లింపులను అమలుచేస్తున్నారు. ఇందులో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో శనివారం నుంచి డిజిటల్ చెల్లింపులు ప్రారంభమయ్యాయి.

చెన్నై-న్యూఢిల్లీ రైల్వే మార్గంలో అత్యంత కీలకమైన వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం సుమారు 90 రైళ్లు దేశంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతీరోజు వివిధ రకాల వస్తువులు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళుతుంటాయి. గృహోపకరణాలు, మోటార్ సైకిళ్లు నిత్యం వరంగల్ నుంచి వెళ్తూ, వస్తూ ఉంటాయి. వీటికి నిర్ణిత చార్జీలు ఉంటాయి. ఇందుకు సంబంధించిన వివరాలను పార్సెల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పి.ఎం.ఎస్)లో నమోదు చేయగానే పార్సిల్ చార్జి కంప్యూటర్‌లో జనరేట్ అవుతుంది. ఆ మొత్తాన్ని వినియోగదారుడు చెల్లిస్తాడు. అయితే పార్సెల్ బుకింగ్ లావాదేవిల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించిన దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం పలు స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించారు.



వరంగల్ రైల్వే పార్సిల్ కార్యాలయంలో డిజిటల్ పేమెంట్ చేస్తున్న వినియోగదారుడు

బంగారం చోరీ కేసులో ఆరుగురు అరెస్టు

అరెస్టు చేసిన వారిలో ముగ్గురు మైనర్లు

దుగ్గొండి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న మండలంలోని గిర్నిబావిలో ఓ ఇంట్లో చొరబడి బంగారం చోరీకి పాల్పడిన ఆరుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గిర్నిబావిలోని ఓ ఫంక్షన్ హాల్ పక్కన నూతనంగా నిర్మాణం చేసిన ఓ ఇంట్లో ఈ నెల 14న రాత్రి కొంత మంది వ్యక్తులు చొరబడి ఏడున్నర తులాలు బంగారం చోరీకి పాల్పడ్డారు. శనివారం గిర్నిబావి కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా వరంగల్ వైపు నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న కారును సోదాలు చేయగా అందులో బంగారు అభరణాలు ఉన్నాయి. కారులో ఆరుగురు వ్యక్తులు ప్రయాణం చేస్తుండగా, వారిని బంగారు అభరణాలపై ఆరా తీయగా చోరీ చేసినట్లు వెల్లడించారు. కారును, అభరణాలను స్వాధీనం చేసుకొని వరంగల్ కాశిబుగ్గకు చెందిన కేశబోయిన రంజిత్, తాటికాయల రంజిత్, మేకల నిఖిల్‌లతో పాటు మరో ముగ్గురు మైనర్లను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన ముగ్గురుని కోర్టులో హాజరు పరచగా, మైనర్లను జువనల్ కోర్టులో హాజరు పరిచారు. వాహనాల తనిఖీలో సీఐ సాయిరమణ, ఎస్సై వెంకటేశ్వర్లు, హెచ్‌సీ శ్రీనివాస్, పీసీలు రంజిత్, శేఖర్, రాకేశ్, షబ్బీర్, రాజ్‌కుమార్, మురళి, ఉపేందర్, రంజిత్, హోంగార్డులు ఉన్నారు. బంగారం చోరీ నిందితులను తక్కువ సమయంలో పట్టుకున్నందుకు ఏసీపీ కిరణ్ కుమార్ సీఐ, ఎస్సైలతో పాటు పోలీసులను అభినందించారు.



స్వాధీనం చేసుకున్న కారు

ప్రశాంత్‌నగర్‌లో భారీ చోరీ

35 తులాల బంగారాన్ని దోచుకెళ్లిన దుండగులు

కాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు సుమారు 35 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... కాజీపేట ప్రశాంత్ నగర్‌కు చెందిన దావ కిశోర్ వృత్తిరీత్యా వ్యాపారి. శుక్రవారం సాయం త్రం 7.10నిమిషాలకు భార్య హాస్పిటల్ పనిమీద బయటకెళ్లగా, కిషోర్ ఇంటికి తాళంవేసి పిల్లలను తీసుకుని ట్యూషన్‌కు వెళ్లాడు. కిషోర్ భార్య శుక్రవారం రాత్రి 8.30 నిమిషాలకు ఇంటికి తిరిగి వచ్చే సరికి గేటు తీసి ఉంది. దీంతో అనుమానం వచ్చిన ఆమె భర్తకు ఫోన్ చేయగా ఆయన వచ్చి చూడగా గేటు తీసి మెయిన్ డోర్ తాళం పగలకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బెడ్‌రూమ్‌లో బీరువా పగలకొట్టి అందులో ఉన్న బంగారం హారం సెట్, వడ్డాణం, గోల్డ్‌కాయిన్స్, బంగారు గాజులను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. కిషోర్ వెంటనే పోలీసులకు సమచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంలను పిలిపించి నిందితుల చేతిముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 35 తులాల బంగారం చోరీ జరిగిందని, దాని విలువ సుమారు రూ.15లక్షలు ఉంటుందని కాజీపేట ఎస్సై వి.నవీన్‌కుమార్ తెలిపారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.



ఘటనా స్థలంలో విచారిస్తున్న పోలీసులు

ప్రమాదానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

టీవీఏసీ జాక్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో సీఈ కార్యాలయం ఎదుట ఆందోళన

హనుమకొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో ప్రాణాపాయ స్థితిలోకి చేరడానికి కారకులైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ ములుగు రోడ్డులోని ట్రాన్స్‌కో సీఈ కార్యాలయం ఉమ్మడి వరంగల్ నుంచి తరలివచ్చిన ఆర్టిజన్ కార్మికులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా జాక్ చైర్మన్ కె.ఈశ్వర్ రావు మాట్లాడుతూ.. నర్సంపేట 132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఈనెల 21న విధినిర్వహణలో ఉన్న గ్రేడ్-1 ఉద్యోగి కృష్ణపై ఒత్తిడి తీసుకొచ్చి పెయింటింగ్ వేయించడం వల్ల విద్యుత్ షాక్ వచ్చి 70 శాతం శరీరం కాలిపోయారన్నారు. కృష్ణపై ఒత్తిడి పెంచి ప్రమాదానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోని మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 3 నెలల కిందట ధర్మసాగర్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ గ్రేడ్-2 ఉద్యోగి రాజ్‌కుమార్‌కు విధినిర్వహణలో వెన్నుపూస విరగిందని, అతడికి సైతం మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈ టెక్నికల్ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జేఏసీ చైర్మన్ ఐలయ్య, కన్వీనర్లు కందికొండ వెంకటేశ్, రాజన్న నాయకులు శివానందమూర్తి, వడ్డెపల్లి శ్రీనువాస్, ఆనంద్, జయచందర్, రాజేశ్, సృజన, శ్రీలక్ష్మీ, కళ్యాణి, శ్రీకాంత్, శివ, శంకర్, బాలాజీ, రవి, రఘు, గోవింద్, రమేశ్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

మహారాష్ట్ర విజయంపై బీజేపీ సంబరాలు

హసన్‌పర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి చారిత్రాత్మక విజయం సాధించడంపై శనివారం హసన్‌పర్తిలో 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మారపల్లి రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, రైల్వే బోర్డు మెంబర్లు మేకల హరిశంకర్, దాసరి రాజు, డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెద్దమ్మ నాగరాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్, దాట్ల సునీల్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, వేణుచారి, భిక్షపతి, జ్ఞానేశ్వర్, రాజు, నంద, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట, నవంబరు (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించటం పట్ల బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. వరంగల్ జిల్లా నాయకుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో శనివారం శంభునిపేట, విశ్వనాథకాలనీల్లో విజయోత్సవాలు నిర్వహించారు. బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచారు. భవిష్యత్‌లో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్, నాయకులు గందె గోపి, రావుల రాజు, మంద బాబురావు, సామ్రాజ్యం, సాంబరాజు, పలిపాక జనార్దన్, రమేష్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● జూలైవాడ: మహారాష్ట్రలో భారతీయ జనతా పార్టీ గెలుపొందిన సందర్భంగా 59వ డివిజన్‌లోని వికాస్‌నగర్ చౌరస్తాలో శనివారం బీజేపీ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్రలో బీజేపీ గెలుపొందడం ఆనందదాయకమన్నారు. రాబోయే రోజుల్లో కూడా తెలంగాణ భారతీయ జనతా పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్తదశరథం పటేల్, నాగపురి వెంకటేశ్‌గౌడ్, ధనరాజు, రమణారెడ్డి, రమేశ్‌రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, ఉమారెడ్డి, సాగర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, భాస్కర్, సాయి శరత్, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్, రామ్‌చందర్ పాల్గొన్నారు.

● మడికొండ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం మడికొండ చౌరస్తాలో ఆపార్టీ నాయకులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బీజేవైఎం జిల్లా నాయకులు తక్కళ్లపల్లి నిఖిల్‌రావు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బరిగెల పినోకర్ బాబు, గుండాల కళ్యాణ్, బుర్ర నరేష్, చట్ల అజయ్, దారంగుల రాజేష్, దార ధనుంజయ్, బుర్ర రమేష్, వస్కుల భాస్కర్, తాడం రంజిత్, గడ్డం కిరణ్, పల్లకొండ రాజేందర్, వస్కుల విజయ్‌కుమార్, చందా రణధీర్ పాల్గొన్నారు.



మడికొండ చౌరస్తాలో బీజేపీ శ్రేణుల సంబరాలు



కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



హసన్‌పర్తి మండలకేంద్రంలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు



వరంగల్ విశ్వనాథ కాలనీలో బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

● ఈఎల్స్ మంజూరు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఈఎల్స్‌ను మంజూరు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గత వేసవి సెలవుల్లో లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఈఎల్స్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల బిల్లులు పెండింగ్ లేకుండా సత్వరమే క్లియర్ చేయాలన్నారు. రెండు మూడు రోజుల్లో ఈఎల్స్‌కు సంబంధించిన ఉత్తర్వులను రెండు, మూడు రోజుల్లో ఇస్తానని హామీ ఇచ్చినట్లు భోగేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్, ప్రధానకార్యదర్శి ఇ. వీరస్వామి, ఉపాధ్యక్షులు ముజాయిద్‌అలీ, కార్యదర్శి ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● వికలాంగుల పెన్షన్ పెంచాలి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పెన్షన్ పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) నాయకులు.. ఎంఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట రవి ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ పి.ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట రవి మాట్లాడుతూ.. వికలాంగులు ఎంతో ఇబ్బందికర పరిస్థితుల్లో తమ జీవితాలను గడుపుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి పెన్షన్ పెంచాలన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో వీహెచ్‌పీఎస్ నాయకులు సింగారపు రజిత, రాజు, చెన్నారపు స్వామి, వక్కల భాగ్య తదితరులు ఉన్నారు.

● హ్యూమన్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలిగా రజియా

మిల్స్‌కాలనీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫోరమ్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా వరంగల్ చింతల్‌కు చెందిన ఎండి. రజియా సుల్తానను నియమించారు. ఈ మేరకు శనివారం చింతల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఉప్పలయ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ ప్రతినిధులు ల్యాదెల్ల రవీందర్, ఆకారపు రాములు, ఆడెపు వెంకటేశ్వర్లు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని హనుమకొండ బస్టాండ్ ఏరియాలో ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళల కబడ్డీ జట్టు ఎంపిక

కాశిబుగ్గ, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మహిళ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక కోసం శనివారం పోటీలు నిర్వహించారు. ఓ సిటీ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. జిల్లా పరిధిలోని 13 మండలాల నుంచి 75 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు డిసెంబరు7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లాఖాన్, జిల్లా అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాస్, అధ్యక్షుడు రాంరెడ్డి, సహాయ కార్యదర్శి మల్లికార్జున్, అత్తర్ పాషా, ముఖర్జీ పాల్గొన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పడ్డ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులను సన్మానించారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ



క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఉదయభానురావు

కేయూ క్యాంపస్ నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కేయూ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్ కాలేజీయెట్ క్రికెట్ పురుషుల టోర్నమెంట్ శనివారం హోరాహోరీగా జరిగింది. పోటీలను వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు ముఖ్య అతిథిగా హాజరై టాస్‌వేసి మ్యాచ్‌ని ప్రారంభించారు. శనివారం జరిగిన పోటీల్లో వాసవి కాలేజ్ ఫైనల్‌కు అర్హత సాధించింది. క్రికెట్ పోటీల్లో కేయూ పీడీ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భాస్కర్, ఇతర పీడీలు మట్టెడ కుమార్, అఫ్జల్, అస్లాం, మధుకర్, పల్లెపు కిషన్, బత్తిని జీవన్, మోహనకృష్ణ, రాము, ప్రభాకర్, ఎం. శ్రీనివాసరెడ్డి ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

● రైల్వే ఉద్యోగులకు క్రికెట్ పోటీలు

కాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేడియంలో శనివారం సబ్ డివిజన్ టీఆర్‌డీ క్రికెట్ లీగ్‌మ్యాచ్ నిర్వహించారు. ఈ పోటీలను కాజీపేట రైల్వే ఆస్పత్రి డీఎంవో హరిబాబు హాజరై పోటీలను ప్రారంభించారు. యూనిఫాయిడ్ టీం-టీఆర్‌డీ మధ్య జరిగిన పోటీలలో టీఆర్‌డీ టీమ్ విజయం సాధించింది. రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో, టీఆర్‌డీ ఎస్ఎస్ఈ మహేందర్, జేఈ వెంకటేశ్, రైల్వే ఉద్యోగులు రాజ్‌కుమార్, నర్సింగ్, ప్రశాంత్, రమాకాంత్, ఆలీ, శివకుమార్, రాజు, రాజేందర్, రాజేశ్వర్ రావు, శివ, దినేష్‌పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలి



కాజీపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 4, 5 తేదీలలో జరిగే రైల్వే యూనియన్ ఎన్నికల్లో రైల్వే కార్మికులంతా మజ్దూర్ యూనియన్‌కు ఓట్లు వేసి గెలిపించాలని యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్ అన్నారు. శనివారం డీజిల్‌లోకో షెడ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మికులకోసం పోరాడే మజ్దూర్‌ను బలపర్చాలని పలువురు నాయకులు కోరారు. బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్‌కే జానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● బొడ్రాయి వేడుకలను జయప్రదం చేయాలి

ఖిలావరంగల్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి 26 వరకు వరంగల్ కోటలో బొడ్రాయి 5 సంవత్సరాల వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం పిలుపునిచ్చారు. శనివారం ఖిలావరంగల్‌లో ఆయన మాట్లాడుతూ బొడ్రాయి ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఆదివారం నుంచి మంగళవారం వరకు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి గజ్జెల శ్యామ్‌తో పాటు బోళ్ల సారంగపాణి, పుప్పాల రాజేందర్, గొర్రె కోటి, బెల్లంకొండ సుధాకర్, ఎడ్ల క్రిష్ణమూర్తి, పొన్నం బాబురావు, ఇనుముల రాములు, మిట్టపెల్లి వెంకటేశ్వర్లు, నరిమేటి లింగమూర్తి, రావుల రాజేష్, శ్రీపతి వాణి, బి. మొగిళి, భాస్కర్, కట్టమల్లు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

చాటింపు



ఖిలా వరంగల్‌లో మాట్లాడుతున్న బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ఇనుముల మల్లేశం

కార్మిక సంఘాల ర్యాలీని జయప్రదం చేయాలి



మార్కెట్లో ప్రచారం చేస్తుతన్న రైతు సంఘాల నాయకులు

వరంగల్ వ్యవసాయం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న వరంగల్‌లో నిర్వహించే రైతు, కార్మిక సంఘాల ర్యాలీని జయప్రదం చేయాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు గంగుల దయాకర్ మాట్లాడుతూ.. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలను, రాయితీలను తగ్గిస్తూ మార్కెట్ వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. ర్యాలీలో కార్మికులు, కర్షకులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరగోని శంకరయ్య సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, ముక్కెర రామస్వామి, గన్నారపు రమేష్ మాలోతు సాగర్, సుదముల్ల భాస్కర్, ఓదెల రాజన్న, ఎంఏ. పాషా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత



విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 48వ డివిజన్‌కు చెందిన రామిండ్ల విజయ్‌కుమార్ ఇటీవలే విద్యుతాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. శనివారం హనుమకొండలోని ప్రజాభవన్ కార్యాలయంలో విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రూ.5 లక్షల చెక్కు అందచేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌-కో ఏడీ సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీధర్‌తో పాటు మాజీ కార్పొరేటర్ అబుబాకర్, సింగారపు రవి ప్రసాద్, శ్రీకాంత్, కుమార్ పాల్గొన్నారు.

● మహాపడి పూజ పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ కల్చరల్: భద్రకాళి దేవస్థానం సమీపంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయంలో డిసెంబరు 11న అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక నిర్వాహకుడు బ్రహ్మశ్రీ టీఆర్ బాల సుబ్రహ్మణ్య శర్మ, నిర్వాహకులు గణపతి శర్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. వేడుకలకు హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భద్రకాళి దేవస్థానం అర్చకులు భద్రకాళి శేషు, సత్యం అయ్యగారు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికురాలి తొలగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన బోధనం అందించడం లేదని గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్మికురాలిని తొలగించారు. ఈ మేరకు ఎం.జ్ఞానేశ్వర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ సత్యశారద శనివారం నిర్వహించిన తనిఖీలో మధ్యాహ్న భోజనం బాగాలేదని విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు డీఈవో మరోసారి తనిఖీ నిర్వహించారు. విద్యార్థులను మధ్యాహ్న భోజన వివరాలు, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సరిగా అందడం లేదని విద్యార్థులు తెలుపడంతో సదరు కార్మికురాలిని వెంటనే తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు మరో కొత్త కార్మికురాలిని నియమించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా డీఈవో కోరారు.

అకుడ్ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): కేయూలో ఇటీవల నూతనంగా ఆవిర్భవించిన అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్స్ (అకుడ్)లోగోను శనవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి ఇతర బాధ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీలో నాణ్యమైన పరిశోధన జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకుడ్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, రాజ్‌కుమార్ ఇతర నాయకులు నర్సింహారావు, పుల్ల శ్రీనివాస్, ఆశీర్వాదం, శ్రీకాంత్, లింగయ్య, ప్రసాద్, స్వామి, నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, బబిత, మహేందర్, సుధాకర్, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరికలు



హమాలీ కార్మికులను యూనియన్‌లోకి స్వాగతిస్తున్న నాయకులు

కరీమాబాద్, నవంబరు23, (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి తాళ్లపెల్లి జాన్‌పాల్ ఆధ్వర్యంలో శనివారం సామిల్ హమాలీ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ వారికి కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు పెన్షన్ చట్టాలను అమలు చేయాలని, హమాలీ, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, సామిల్ కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, హమాలీ కార్మికులకు యేటా రెండు జతల డ్రెస్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధన్, సామిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌ముకుందం పాల్గొన్నారు. యూనియన్‌లో చేరిన వారిలో బండారి భిక్షపతి, శ్రీనివాస్, సోమయ్య, రవి, హుస్సేన్, కుమార్, ప్రసాద్, బాబు, కుమార్, శ్రీను, స్వామి, ఇస్మాయిల్, అలీ, బాబా తదితరులు ఉన్నారు.

దేశ భద్రతలో ఎన్‌సీసీ విద్యార్థుల పాత్ర కీలకం





హసన్‌పర్తి గురుకులంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉర్సు గుట్ట వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

హసన్‌పర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రతలో ఎన్‌సీసీ విద్యార్థుల పాత్ర కీలకమని 8(టీ) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండెంట్ ఆఫీసర్ కల్నల్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డు తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ ఇందుమతి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 8(టీ) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండెంట్ ఆఫీసర్ కల్నల రవీంద్రకుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ రేవతి ప్రభాకరన్ మార్గదర్శకత్వంలో అనేక సమాజిక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ఉత్సాహంతో పోస్టర్ తయారీ పోటీలో పాల్గొని ఎన్‌సీసీ ప్రాథమిక విలువలను, పౌర బాధ్యతలను, పర్యావరణ పరిరక్షణ విజయాలను ప్రతిబింబింపజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు నాయకత్వ నైపుణ్యాలను, సమాజ సేవాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీఐ సిబ్బంది హవల్దార్ దర్మరావు, నాయక్ చేతన్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

● ఎన్‌సీసీ సేవలు దేశానికి అవసరం

వడ్డెపల్లి: ఎన్‌సీసీ క్యాడెట్స్ సేవలు దేశానికి ఎంతో అవసరమని మానవ అక్రమ రవాణా వ్యతిరేక యూనిట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఏహెచ్‌టీయూ సీఐ) పి.వెంకన్న అన్నారు. శనివారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అరుణ, ఎన్‌సీసీ ఆఫీసర్లు, క్యాడెట్స్ పాల్గొన్నారు.

● ఉర్సుగుట్టలో అవగాహన ర్యాలీ

కరీమాబాద్: ప్రాణకోటికి జీవాధారమైన నీటిని ప్రతీ ఒక్కరు పొదుపుగా వాడుకోవాలని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు సత్యనారాయణ, నరేంద్ర కోరారు. శనివారం ఉర్సు గుట్టలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూ గురుకులం విద్యార్థినులు 77వ ఎన్‌సీసీ అవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ బ్యానర్లు పట్టుకొని నీటిని కాపాడుదాం.. పచ్చదనాన్ని పెంపొందిద్దాం.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇపుడు తాగునీటిని వృథా చేస్తే భవిష్యత్తులో తాగడానికి నీరు లభించదని అన్నారు. ఆ పరిస్థితి రావొద్దంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, తద్వారా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఎన్‌వో మానస, అధ్యాపకులు పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో దీపోత్సవం

వరంగల్ కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శనివారం చారిత్రక భద్రకాళి ఆలయంలో దీపోత్సవాలను నిర్వహించారు. ఆలయ సన్నిధిలో సామూహికంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అష్టమి కావడంతో పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం భద్రేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించి అలంకరించారు. నగరంలోని సాంస్కృతిక నాట్యాలయ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం కార్తీక దీపోత్సవాలను నిర్వహించినట్లు ఈవో శేష భారతి తెలిపారు.

సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు

కాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలు శనివారం కాజీపేటలో ఘనంగా జరిగాయి. పేదలకు దుప్పట్లు, అన్నం ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌కె రాజు, సిరిపురం వెంకటయ్య, డివి పద్మారావు, ఆంజనేయులు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కాలర్‌షిప్ టెస్ట్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ (ఎన్ఎంఎంఎస్) ఆదివారం నిర్వహించనున్నట్లు హనుమ కొండ డీఈవో డి.వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో 627 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏసీజీఈ బి.భువనేశ్వరి పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతికంగా రాణించాలి

ఎస్సార్ వర్సిటీ ఏఐ విభాగం డీన్ ఇంద్రజిత్ గుప్తా



జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఐ విభాగం డీన్ ఇంద్రజిత్ గుప్తా

హసన్‌పర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక నిపుణులుగా రాణించాలని ఎస్సార్ విశ్వవిద్యాలయం ఏఐ విభాగ డీన్ డాక్టర్ ఇంద్రజిత్ గుప్తా అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం 12 గంటల పాటు నిర్విరామంగా కోడింగ్ పరిజ్ఞాన హ్యాకథాన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంద్రజిత్ మాట్లాడుతూ విద్యార్థులను సాంకేతిక నిపుణులుగా తీర్చదిద్దడానికి హ్యాకథాన్ దోహదపడుతుందన్నారు. సీ ప్రోగ్రామింగ్‌పై మరింత శ్రద్ధ కలిగిస్తుందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇది కొంతకాలంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరగా నేర్చుకునే సాధనంగా హ్యాకథాన్ పరంపర కొనసాగుతుందన్నారు. ఈ హ్యాకథాన్ రాత్రి 8 గంటల కు ప్రారంభమై ఉదయం 8 గంటలకు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్జెక్టు కోఆర్డినేటర్లు బి.విజయకుమార్, డాక్టర్ మీనాక్షీషా, కోఆర్డినేటర్ డాక్టర్ కె.సురేష్ పాల్గొన్నారు.

సమస్యలను విస్మరించిన సర్కారు

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ప్రభాకర్

వడ్డెపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ అన్నారు. శనివారం హనుమకొండలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు విజయలక్ష్మి, సత్యనారాయణ, విద్యాసాగర్, నయీమొద్దీన్, నారాయణరావు, మాదిరెడ్డి మల్లారెడ్డి, సతీష్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

కాజీ జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని స్లమ్ ఏరియాలైన వాజ్‌పాయ్ నగర్, కృష్ణ కాలనీలో నివసించే నిరుపేద విద్యార్థులకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్, కేయూ పాలక మండలి సభ్యురాలు కె.అనితారెడ్డి ఉచితంగా నోట్ పుస్తకాలు, స్టేషనరీ శనివారం పంపిణీ చేశారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా గత వారం పిల్లలతో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో తమ పిల్లలు చదువుల కోసం పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు కావాలని కోరినందున శనివారం కృష్ణ కాలనీలోని ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 84 మంది విద్యార్థులకు సామగ్రిని అందజేసినట్లు అనితారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సి.భిక్షపతి, హెడ్‌మాస్టర్ హరిప్రసాద్, ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లు రైలు.. యమ స్పీడు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే అభివృద్ధికి వేగంగా అడుగులు

- కాజీపేట రైల్వే స్టేషన్‌కు డివిజన్ హోదాకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- కాజీపేటలోనే కోచ్ ఫ్యాక్టరీకి ఏర్పాటునకు ఇప్పటికే అనుమతి
- కొత్త రైల్వే మార్గాలకు నిధుల విడుదల

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

దక్షిణ భారతదేశ రైల్వేకు ముఖద్వారంగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్ రూపురేఖలు మారనున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఓరుగల్లు వాసులు ఎదురుచూస్తున్న కోచ్ ఫ్యాక్టరీతో పాటు రైల్వే డివిజన్ ఏర్పాటుపై అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే మ్యానుఫాక్చరింగ్ యూనిట్ పనులు వేగంగా జరుగుతుండగా, కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ హోదాతో రైల్వేమ్యాప్‌లో కాజీపేటకు ప్రత్యేక గుర్తింపు రానుంది. అలాగే కాజీపేట జంక్షన్ నుంచి కొత్తగా రైల్వేలైన్లు, కొత్తగా ట్రయాంగిల్ పట్టాల ఏర్పాటుకు కసరత్తు చేస్తుండటంతో ప్రయాణికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వీటితో పాటు కొత్త ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీని పెంచేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. దీంతో భూపాలపల్లి, మేడారం మీదుగా కొత్తగా రైల్వే లైన్ రానుంది. తెలంగాణలో అతిపెద్ద రెండో రైల్వే జంక్షన్‌గా ఉన్న కాజపేట నుంచి ఇక కొత్త రైళ్లు, మరిన్ని వర్క్‌షాపులు రానుండటంతో రైల్వే ఉద్యోగులు, ప్రయాణికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

అతిపెద్ద రెండో జంక్షన్ కాజీపేట

కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియా ధృవాలను కలిసే రైల్వే మార్గం కాజీపేట జంక్షన్. కాశీ నుంచి కన్యాకుమారి, చెన్నై నుంచి కోల్‌కత్తా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు ఎక్కడికి వెళ్లాలనుకున్నా.. కాజీపేట రైల్వేస్టేషన్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక అదాయం వచ్చే కాజీపేట.. తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జంక్షన్‌గా ఉంది. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతీరోజు సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెంతో పాటు బల్లార్షా తదితర ప్రాంతాల నుంచి బొగ్గు రవాణా, సరుకుల రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే సాగుతుంటాయి. ఎక్కువ అదాయం వచ్చే జంక్షన్‌లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తోంది.


కాజీపేట రైల్వే స్టేషన్

డివిజన్ హోదాకు రైల్వేశాఖ సై

ఉత్తర, దక్షిణ ధృవాలను కలిపే కాజీపేట జంక్షన్‌కు ఇక మహర్దశ పట్టనుంది. 30ఏళ్లకుపైగా కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ ఎట్టకేలకు సాకారం కాబోతోంది. ప్రస్తుతం సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణమధ్య రైల్వే జోన్ పని చేస్తోంది. ఈ జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ (మహరాష్ట్ర), ఏపీలోని గుంతకల్, విజయవాడ, గుంటూరు రైల్వే డివిజన్‌లు ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒత్తిడితో విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రైల్వేజోన్ కొనసాగాలంటే కనిష్ఠంగా మూడు డివిజన్లు ఉండాలి. ప్రస్తుతం సికింద్రాబాద్ కేంద్రంగా సౌత్ సెంట్రల్ రైల్వే జోన్‌లో గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్‌లతో విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక మహారాష్ట్రలోని నాందేడ్ డివిజన్‌ను ముంబయి కేంద్రంగా ఉన్న సెంట్రల్ రైల్వేజోన్‌లో కలపనున్నారు. దీంతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న సౌత్ సెంట్రల్ జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్‌లు మాత్రమే మిగులుతున్నాయి. రైల్వే నిబంధనల ప్రకారం మూడు డివిజన్‌లు లేకపోతే డివిజన్ హోదా రద్దవుతుంది. ఈ నేపథ్యంలో రైల్వేశాఖకు కాజీపేటను డివిజన్‌గా మార్చి సికింద్రాబాద్ దక్షిణమధ్య రైల్వేజోన్‌లో కలపాలని నిర్ణయించారు. దీంతో మూడు డివిజన్‌లతో సౌత్ సెంట్రల్ జోన్ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ అధికారుల ఆదేశాలతో దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు రంగంలోకి దిగి కాజీపేట డివిజన్‌కు హద్దులను నిర్ణయిస్తున్నారు. దీంతో హైదరాబాద్ వైపు భువనగిరి - ఆలేరు, ఢిల్లీ వైపు బల్లార్షా, వరంగల్ నుంచి విజయవాడ వైపు కొండపల్లి, మణుగూరు - సత్తుపల్లి సెక్షన్‌ను హద్దులుగా ఖరారు చేయనున్నారు. వచ్చే బడ్జెట్ నాటికి కాజీపేట పూర్తిస్థాయిలో రైల్వే డివిజన్‌గా రూపాంతరం చెందనుంది.

అయితే దక్షిణ, ఉత్తర ధృవాలను కలిపే రైల్వేమార్గం అయినప్పటికీ ఇక్కడ ట్రయాంగిల్ ప్లాట్‌ఫారాలు లేవు. దీంతో ఢిల్లీ నుంచి చెన్నై, ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే ప్లాట్‌ఫారాలపై నిలిపే అవకాశం లేకుండాపోతోంది. డివిజన్ హోదాతో ట్రయాంగిల్ ప్లాట్‌ఫారాలతో పాటు ఇక్కడి నుంచే కొత్తగా రైళ్లను నడిపించే అవకాశం ఉంది. ప్రస్తుతం 5వేల మంది వరకు రైల్వే ఉద్యోగులు ఉండగా, డివిజన్ ఏర్పాటుతో రెండింతలు ఉద్యోగుల సంఖ్య పెరగనుంది.

కొత్త లైన్లతో పెరగనున్న కనెక్టివిటీ

ఓరుగల్లులో రైల్వే కనెక్టివిటీ పెంచేందుకు రైల్వేశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు సుమారు రూ.4,100కోట్ల అంచనా వ్యయంతో 207కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే మట్టి సేకరణ టెస్టింగులు పూర్తి చేసిన అధికారులు, రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. ఈలైన్ నిర్మాణం పూర్తైతే బొగ్గు రవాణాతో పాటు మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు రైల్ కనెక్టివిటీ పెరగనుంది. అలాగే యునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు సైతం వచ్చే పర్యాటకులకు రైల్ సౌకర్యం ఏర్పడనుంది.

అలాగే మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ. రైల్వేలైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వే శాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేసింది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అనుసంధానమవుతుంది. అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలోమీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్‌కోసం రూ.5వేలకోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగూళూరు లైన్‌ను అనుసంధానం చేసేందుకు డోర్నకల్-గద్వాల లైన్ ఏర్పాటు చేస్తున్నారు.

కీలకమైన రెండు మార్గాలను అనుసంధానంతో పాటు కొత్తగా రైల్వేలైన్ లేని ప్రాంతాలకు కూడా రైల్వే కనెక్టివిటీ పెరుగుతుంది. అలాగే కాజీపేట(నష్కల్)- కరీంనగర్ మధ్య రూ.464కోట్ల అంచనా వ్యయంతో 62కి.మీ. రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో హనుమకొండ - కరీంనగర్ మధ్య దూర భారం తగ్గటంతో పాటు గ్రానైట్ పరిశ్రమకు అనుకూలంగా మారనుంది. అయితే కాజీపేట - భూపాలపల్లి లైన్ మాత్రమే ఇంకా పట్టాలెక్కాల్సి ఉంది. మొత్తానికి కొత్త రైల్వే కనెక్టివిటీతో పాటు డివిజన్ హోదా, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో కాజీపేట జంక్షన్ కొత్తరూపు సంతరించుకోనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కోచ్ ఫ్యాక్టరీకి గ్రీన్ సిగ్నల్

రైల్వేశాఖ కాజీపేట జంక్షన్‌పై వరాలు కురిపిస్తోంది. ఇప్పటికే కాజీపేటలో డీజిల్ లోకోషెడ్స్, ఎలక్ట్రిక్ లోకోషెడ్స్ ఉన్నాయి. 150కి పైగా డబ్ల్యుఏజీ-7 ఎలక్ట్రికల్ లోకోలను నిలుపుదల చేసే సామర్థ్యం ఉంది. వీటితో పాటు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది. 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా భూమి పూజ నిర్వహించారు. 2025లోగా పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈవ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే దీనిపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. 55ఏళ్లకుగా పైగా కోచ్ ఫ్యాక్టరీ కోసం డిమాండ్ చేస్తుంటే.. వ్యాగన్ తయారు ఫ్యాక్టరీ ఇవ్వటంపై ఓరుగల్లు వాసులు నారాజ్ అయ్యారు. దీంతో ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కాజీపేటలో వందేభారత్ రైళ్లకోచ్‌లను కాజీపేటలో తయారు చేస్తామని ప్రకటించారు. దీంతో కోచ్ ఫ్యాక్టరీ కూడా కాజీపేటలో ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వ్యాగన్ తయారీ ఫ్యాక్టరీని అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా మార్చనున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఓరుగల్లువాసులు ఎదురుచూస్తున్న కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ హోదా కాజీపేటకు వస్తుండటంతో హర్షం వ్యక్తమవుతోంది.


క్రీడా పోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న అంతర్జాతీయ స్థాయి జిమ్నాస్ట్ అరుణరెడ్డి


వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

గ్రామీణ క్రీడాకారులు ఒలంపిక్స్‌లో ఆడాలి

- అంతర్జాతీయ జిమ్నాస్ట్ బుద్ధ అరుణరెడ్డి
- జేఎన్ఎస్‌లో అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు
- వాలీబాల్ విజేత పడిగాపూర్, త్రోబాల్ విజేత కమలాపూర్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి నుంచి క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని పట్టుదలతో సాధన చేస్తూ ఒలంపిక్స్ పాల్గొనేలా క్రీడాకారులు కృషి చేయాలని అంతర్జాతీయ జిమ్నాస్ట్ బుద్ధ అరుణరెడ్డి కోరారు. ఈషా ఫౌండేషన్ కోయంబత్తూర్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ జేఎన్ఎస్ వాలీవాల్ కోర్టులో మొదటి లెవల్ క్లస్టర్ (జిల్లా) స్థాయి మెన్ వాలీబాల్, ఉమెన్ త్రోబాల్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మెల్‌బోర్న్‌లో ప్రపంచ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన, అంతర్జాతీయ జిమ్నాస్ట్ బుద్ధ అరుణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండే విధంగా వారి తల్లిదండ్రులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈషా ఫౌండేన్ క్రీడా పోటీల ఆర్గనైజర్ మిట్టపల్లి వేణుగోపాల్ మాట్లాడుతూ.. మరుగునపడుతున్న గ్రామీణ క్రీడలకు పునరుజ్జీవం పోసేందుకు ఈషా ఫౌండేన్ ఆధ్వర్యంలో ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్లస్టర్, (జిల్లా) రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురుషులకు వాలీవాల్, మహిళలకు త్రోబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించడంతో పాటు మొత్తంగా రూ.కోటి నగదు ప్రోత్సాహకాలు, ట్రోఫీలను అందిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 ఏళ్ల నుంచి 80ఏళ్ల వయస్సులోపు మహిళలకు త్రోబాల్ క్రీడాంశాల్లో ఒక్క రోజు పాటు పోటీలు నిర్వహించామన్నారు. త్రోబాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్టును రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పురుషుల వాలీబాల్ క్రీడలో 22 జట్లు పాల్గొన్నాయన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటిన జట్లు డిసెంబర్ 28న ఈషా యోగా కేంద్ర కోయంబత్తూర్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఫైనల్ పోటీలకు ఎంపిక చేస్తారన్నారు.

కాగా, ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ క్రీడకారులు వయస్సుతో సంబంధం లేకుండా గెలుపే లక్ష్యంగా క్రీడల్లో దూసుకుపోయారు. గ్రామీణ క్రీడలుగా ప్రాచుర్యంలో ఉన్న గోనె సంచుల దూకుడు, సైకిల్‌టైర్ పరిగెత్తించడం, లెమన్ స్పూన్ క్రీడలు మహిళకు ప్రత్యేకంగా నిర్వహించి ఇందులో ప్రావీణ్యం పొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. గ్రామీణ స్థాయి పురుషుల వాలీబాల్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో పడిగాపూర్ ప్రథమ స్థానం, నీరుకుళ్ల ద్వితీయ, రాంపూర్ తృతీయ, తీగరాజుపల్లి జట్లు చతుర్థస్థానాల్లో నిలిచాయి. మహిళ త్రోబాల్‌లో కమలాపూర్ ప్రథమ స్థానం, శాయంపేట ద్వితీయ, అంబాల తృతీయ, పెద్దపెండ్యాల చతుర్థ స్థానాల్లో విజయం సాధించారు. ఈ సందర్భంగా హంటర్‌రోడ్డులోని పీఎస్‌పీ కళానిలయానికి చెందిన చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. క్లస్టర్ (జిల్లా) స్థాయిలో విజయం సాధించిన జట్లకు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి బహుమతులను, నగదు పురస్కారాన్ని అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ సభ్యులు శిరిష, సింధు, డాక్టర్ రమాకాంత్, యశ్వంత్, త్రోబాల్ కోచ్ అన్వర్‌పాషా, డీఎస్ఏ వాలీబాల్ కోచ్ జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాడెద్దుకు కన్నీటి వీడ్కోలు


ఇనుగుర్తిలో కాడెద్దుకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న రైతు కుటుంబం

ఇనుగుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో రైతుకు తోడుగా ఉండే ఎడ్లతో కుటుంబ సభ్యుల మాదిరిగా ప్రత్యేక అనుబంధం ఉంటుంది. అలాంటి ఎద్దు ఆకస్మికంగా ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ రైతు కుటుంబం తల్లడిల్లిపోయింది. తమ కుటుంబ సభ్యుడు మృతి చెందినట్లుగా భావిస్తూ సంప్రదాయ పద్ధతిలో ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించిన ఉదంతం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఇనుగుర్తి గ్రామానికి చెందిన అనుగుల నర్సయ్య-నిర్మల రైతు దంపతులకు రెండు కాడెడ్లు ఉన్నాయి. తాము కౌలుకు తీసుకున్న భూమిలో మొక్కజొన్న విత్తనాలు వేసేందుకు చెల్క దున్ని భోజన విరామంలో బావిపక్కనే గడ్డివాము వద్ద ఎడ్లను శనివారం కట్టేశారు. పక్కనే ఉన్న బావిలోకి ప్రమాదవశాత్తు ఒకఎద్దు జారి పడిపోయింది. ఈ ఎద్దుకు కట్టిన తాడు అలాగే ఉండడంతో బావిలోకి జారిన ఎద్దు మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతు కుటుంబం ఎద్దు మృతితో రోదించారు. చెల్క వద్దనే హిందూ సంప్రదాయ పద్ధతిలో ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు. రూ. 60 వేల విలువైన ఎద్దు ప్రమాదవశాత్తు కోల్పోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆ రైతు దంపతులు కోరారు.

- దీర్ఘకాలిక వ్యాధులకు నడక దివ్యౌషధం
- వింటర్‌లో అవసరమంటున్న నిపుణులు
- అసోసియేషన్లుగా ఏర్పడుతున్న వాకర్లు
- ఆరోగ్యంతో పాటు పొదుపు పైన దృష్టి



చలికాలంలో.. వాకింగ్

రఘునాథపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యమే మహా భాగ్యం.. అనే సూత్రాన్ని అందరూ నమ్ముతారు. కానీ కొందరే ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వాకింగ్, వ్యాయామంతో పాటు ఆహార నియమాలు లాంటివి పాటిస్తుంటారు. ప్రస్తుతం మారుతున్న కాలమాన పరిస్థితులతో చాలామంది వాకింగ్‌పై దృష్టిపెడుతున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల వారు మాత్రమే మార్నింగ్‌వాక్ చేస్తూ కనిపించే వారు. కానీ ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ వాకింగ్‌పై శ్రద్ధ పెరిగింది. యోగ గురువులు, వైద్య నిపుణులు చెబుతున్న సూచనలను పాటిస్తూ వాకింగ్‌తో దీర్ఘకాలిక వ్యాధులను దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే వానాకాలం, ఎండాకాలంలో కంటే చలికాలంలో ఉదయం లేదా సాయంత్రం వాకింగ్ చేయడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

చలిలో వాకింగ్ చేయడం వల్ల బిగుసుకు పోయిన కండరాలు, నరాల్లో ఉత్తేజం వస్తుందని, క్యాన్సర్, మధుమేహం, గుండె జబ్బులు తగ్గుతాయని, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందని, స్థూలకాయం, రక్తపోటు, కొవ్వు లాంటివాటికి పరిష్కారం దొరుకుతుందని చెబుతున్నారు. ప్రతి రోజు నడవడం వల్ల పక్షవాతం వచ్చే అవకాశాలు 50శాతం వరకు తగ్గడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని, నిద్రలేమితో బాధ పడే వారికి ఉపశమనం కలుగుతుందని, మహిళల్లో 70 శాతం డిప్రెషన్ తొలుగుతుందని, ఛాతిక్యాన్సర్ రాకుండా ఉంటుందని వివరిస్తున్నారు. వాకింగ్, వ్యాయామంతో పాటు సమతుల ఆహారం కూడా తీసు కోవాలని సూచిస్తున్నారు. ఇక వాకింగ్ చేయడానికి 15నిమిషాల ముందు నీరు తాగాలని, టీ, కాఫీల లాంటివి తీసుకోవద్దని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు. ఎంతో మంది వాకర్లు అసోసియేషన్లుగా ఏర్పడి ఆదర్శంగా నిలుస్తున్నారు. 20 నుంచి 30 మంది వాకర్స్ కలిసి అసోషియేషన్ ఏర్పాటు చేసుకుని, నెలకు రూ. 500 చొప్పున పొదుపు కూడా చేసుకుంటున్న వారున్నారు.

Sunday SPECIAL

ఆరు పదుల వయస్సులోనూ నడుస్తున్నా..



నేను సుమారు 26 సంవత్సరాల నుంచి రోజూ ఉదయం గంట నుంచి గంటన్నర పాటు వాకింగ్ చేస్తున్నా. వెల్ది గ్రామం నుంచి రఘునాథపల్లి వరకు నడుస్తాను. వాకింగ్ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నా. శరీరం ఎంతో ఉల్లాసంగా..ఉత్సాహంగా ఉంటుంది. నా వంతుగా వాకర్స్‌కు అవసరమైన వ్యాయామ చిట్కాలతో పాటు యోగసనాలను నేర్పుతున్నా. చలికాలంలో వాకింగ్, వ్యాయామం చేయడం మరింత మంచిది.

-రంగు యాదగిరి, రిటైర్డు ఉద్యోగి, వెల్ది

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆరు సంవత్సరాల నుంచి వాకింగ్ చేస్తున్నా. చలికాలంలో మామూలు రోజుల కన్నా ఎక్కువ వ్యాయామం చేసే అవకాశం ఉంటుంది. నడకతో శరీరంలో పేరుకుపోయిన చెడు కొవ్వులను తగ్గించుకునే వీలు కలుగుతుంది. చలికాలంలో రోజూ ఉదయం గంటన్నర పాటు వాకింగ్ చేస్తా. అలాగే వ్యాయామం చేయడం వల్ల మానసిక ఒత్తిడి తొలగి ప్రశాంతంగా ఉండగలుగుతున్నాను. మేము వాకర్స్ అసోషియేషన్ ఏర్పాటు చేసుకున్నాం.

నీలం ఐలేష్, ఎన్పీడీసీఎల్ ఉద్యోగి, రఘునాథపల్లి

నడక విలువ తెలిసి..



సుమారు 13 సంవత్సరాలుగా నిత్యం ఉదయం పూట గంటన్నర పాటు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు నడుస్తున్నా. ఇలా నడవడం వల్ల రోజంతా శరీరం హుషారుగా ఉండడంతో పాటు ఇప్పటీ వరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యంగా ఉన్నా.

శాత్రాసి చిలుపూర్, రెవెన్యూ ఉద్యోగి-రఘునాథపల్లి

ఉచిత విద్యుత్‌తో కేయూకు లబ్ధి

- నెలకు రూ.17 లక్షల మేర బిల్లుల ఆదా
- హర్షం వ్యక్తం చేస్తున్న వర్సిటీ వర్గాలు

కేయూ క్యాంపస్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, కళాశాలకు, విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించడంతో కాకతీయ యూనివర్సిటీకి లబ్ధి చేకూరనుంది. కేయూకు ప్రతీ నెల రూ.17లక్షల పైచికులుకు కరెంట్ బల్లు వస్తోంది. జనవరి-మే ఎండాకాలం సమయంలో ఏకంగా రూ. 25లక్షల మేరకు వస్తోందని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. వర్సి టీలో డబ్బులు లేకపోవడం, వరుస సెలవులు వచ్చినట్లయితే అపరాధ రుసుము సైతం విద్యుత్ అధికారులు నెలకు రూ. 5వేలకు పైగా అదనంగా బాదుతారని చెబుతున్నారు.

అయితే రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవో నెంబరు 20 విడుదల చేసి రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు ఉచితవిద్యుత్ ప్రకటించడంతో వర్సిటీకి విద్యుత్‌బిల్లు కష్టాలు తప్పనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీకి బ్లాక్ గ్రాంట్‌ను తక్కువచేయడంతో వర్సిటీ పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న సమయంలో విద్యుత్ బిల్లులు లేకుండా ఉచిత విద్యుత్ విద్యుత్‌ను అందించడంతో వర్సిటీకి కాస్త ఆర్థిక ఉపశమనం లభించినట్లేనని వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి.

10 ట్రాన్స్‌ఫార్మర్లు.. నిరంతరం విద్యుత్..

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో 10 విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లున్నాయి. వర్సిటీ క్యాంపస్ లోపల రేడియోస్టేషన్ ఎదుట విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. వర్సిటీ క్యాంపస్‌లో నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేసేందుకు బందోబస్తు విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు.

వర్సిటీలోని ఫార్మసీ, కెమిస్ట్రీతో పాటు ఇతర లైఫ్‌సైన్స్ కోర్సులు, ఇంజనీరింగ్ ల్యాబ్‌లున్నాయి. వీటిలో పరిశోధనలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అవసరం ఉంటుంది. అలాగే వర్సిటీలో వేల మంది విద్యార్థులు హాస్టల్స్‌లో బస చేస్తారు. వీరికి ప్రతీ రోజు అవసరమైన తాగునీరు, అవస రాల నీరు సరఫరా చేసేందుకు బోర్లు, మున్సిపల్ శాఖ మంచి నీటిని సరఫరా చేస్తుంది. వర్సిటీలో ఓవర్ హెడ్ ట్యాంకును ఏర్పాటు చేశారు. ట్యాంకుకు హై ఓల్టేజ్‌తో నడిచే విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేశారు. వర్సిటీలో రాత్రిసమయాల్లో ప్రధాన రహదారులవెంట వీధిలైట్లను ఏర్పాటు చేశారు. దీంతో వర్సిటీలో విద్యుత్ వినియోగం ఎక్కువగా జరుగుతోందని వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి.

ఆర్థిక కష్టాలకు కాస్త ఉపశమనం

రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలకు బ్లాక్ గ్రాంట్‌ను క్రమంగా ఏడాదికి ఏడాది తగ్గిస్తోంది. విద్యార్థుల పరీక్షల ఫీజులు, ఇతర సర్టిఫికెట్ల ఫీజులను పెంచుకుని అంతర్గత నిధులను సమకూర్చుకుని ఖర్చులను వెల్లదీసుకోవాలని అంతర్గతంగా చెబుతోంది. అయితే విద్యుత్ చార్జీల రూపంతో రూ.లక్షల్లో వర్సిటీకి నెల నెలా ఖర్చవుతోంది. దీంతో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వర్సిటీ అధికారులకు ఆర్థిక భారంగా మారింది. హాస్టల్ నడిపేందుకు విద్యార్థుల మెస్ బిల్లులను సైతం రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా ఇవ్వకపోవడంతో హాస్టల్ ఖర్చులన్నీ వర్సిటీ కళాశాలల్లో నుంచి ప్రతీ నెల సర్దుబాటు చేస్తున్నారు.



ఆర్ట్స్ కళాశాల, ఇతర కళాశాలలకు ఊరట..

సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు ప్రతీ నెల రూ. లక్షన్నర మేరకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. అలాగే సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, మహిళ కళాశాల, న్యాయ కళాశాలలకు రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. వీటితో పాటు కొత్తగూడెంలోని యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మంలోని వర్సిటీ పీజీ కళాశాలల్లోనూ ప్రతీనెల రూ.లక్ష మేరకు విద్యుత్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వ ఉచిత విద్యుత్‌తో లబ్ధి చేకూరుతోందని వర్సిటీ అధికారులు చేబుతున్నారు. విద్యార్థులకు, వర్సిటీకి ఉచిత విద్యుత్ వరంగా మారిందని చేప్పవచ్చు.

ఉమ్మడి వరంగల్‌లో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డిగ్రీ కళాశాలలు 14 ఉన్నాయి. ప్రధానంగా నగరంలో కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పింగళి మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలున్నాయి. వీటన్నిటికీ ఉచిత విద్యుత్ అందనుంది.

వీటితో పాటు జూనియర్ కళాశాలలు, పాలిటెక్నికల్, ఇంజనీరింగ్, ఇతర పాఠశాల స్థాయి విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ అందనుంది.

గీత కార్మికుడి కుమారులు.. గెజిటెడ్ ఆఫీసర్లు

ఇంగ్లిష్ లెక్చరర్‌గా మనోజ్‌కుమార్ ›› టీఎస్ జెన్‌కో ఏఈగా మరో కుమారుడు


యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న మనోజ్‌కుమార్, వినోద్‌కుమార్, సుమన్

నర్సంపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తేనే బతుకు గడిచే ఓ గీత కార్మికుడు రెక్కముక్కలు చేసుకొని చదివిస్తే తండ్రి పడిన కష్టాన్ని కుమారులు వృథా చేయలేదు. ముగ్గురు కుమారులు ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన నిరుపేద గీత కార్మికుడు గాదెగోని సాంబయ్య-అనసూయ దంపతులకు సుమన్, మనోజ్‌కుమార్, వినోద్‌కుమార్‌లు ముగ్గురు కుమారులు. వీరిలో సుమన్ ఎంఏ(ఇంగ్లిష్) పూర్తి చేసి ప్రభుత్వ లెక్చరర్ (జేఎల్)గా ఉద్యోగం సాధించి ప్రస్తుతం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రెండో కుమారుడైన మనోజ్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ (ఇంగ్లిష్) పూర్తి చేసి, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో బీఈడీ చేసిన అనంతరం ఇదే యూనివర్సిటీలో ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఈ క్రమంలోనే టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి గురువారం రాత్రి విడుదలైన ఫలితాల్లో ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు.

ఇద్దరు సోదరుల బాటలో..

మూడో కుమారుడు వినోద్‌కుమార్ తన ఇద్దరు సోదరుల స్ఫూర్తితో బీటెక్ (మెకానికల్) విద్యనభ్యసించి గేట్‌లో ఉత్తీర్ణత సాధించారు. గత సెప్టెంబర్‌లో విడుదలైన టీఎస్‌జెన్‌కో ఏఈ ఫలితాల్లో ఎంపికయ్యాడు. అలాగే టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈ ఉద్యోగ పరీక్షల్లో ఏఈ మెరిట్ లిస్టులో ఉన్నాడు. ఇలా గీత కార్మికుడి ముగ్గురు కుమారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో పలువురు వీరిని అభినందిస్తున్నారు.


గీత కార్మికుడు సాంబయ్య-అనసూయ దంపతులు



జనగామ జిల్లా రఘునాథపల్లిలో వాకింగ్ చేస్తున్న గ్రామస్థులు

చలికాలంలో వాకింగ్!

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- దీర్ఘకాలిక వ్యాధులకు దివ్యౌషధంలా నడక
- మిగిలిన రోజుల్లో కన్నా ఇప్పుడే ఎక్కువ అవసరమంటున్న నిపుణులు
- అసోసియేషన్లుగా ఏర్పడుతున్న వాకర్లు
- ఆరోగ్యంతో పాటు పొదుపుపైనా దృష్టి

8

నిత్యం ఉదయాన్నే వాకింగ్ చేయడమనేది సర్వ రోగ నివారిణి అని.. సంపూర్ణ ఆరోగ్యానికి కీలక సూత్రమని అందరికీ తెలుసు. అందుకే గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా రోజూ తెల్లవారుజామున అరగంట నుంచి గంట పాటు వాకింగ్ చేయడం అనేక మందికి అలవాటు. 'నడక'పైనే ఆరోగ్య జీవన నడవడిక ఆధారపడి ఉందన్న విషయాన్ని గ్రహిస్తున్నారు. ఫలితంగా మార్నింగ్ వాక్ చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎండాకాలం, వానాకాలం, చలికాలం అనే తేడా లేకుండా యువత నుంచి వృద్ధుల వరకు వాకింగ్, వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకుంటున్నారు. అయితే మిగతా కాలాల మాటెలా ఉన్నా.. చలికాలంలో మాత్రం నడకవల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో తేమ శాతం మూలంగా బిగుసుపోయిన కండరాల్లో ఉత్తేజం నింపుతుందని, రోజంతా శరీరం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేలా చూస్తుందని చెబుతున్నారు.

- రఘునాథపల్లి, ఆంధ్రజ్యోతి





వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఒలింపిక్స్‌లో గ్రామీణ క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించాలి

అంతర్జాతీయ జిమ్నాస్ట్ బుద్ధ అరుణరెడ్డి

జేఎన్ఎస్‌లో అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు

వాలీబాల్ విజేత పడిగాపూర్, త్రోబాల్ విజేత కమలాపూర్ జట్లు

8



నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

పోలీసు వ్యవస్థ దిగజారిపోయింది..

- కాంగ్రెస్ నేతలు, పోలీసుల అక్రమాలపై ఆధారాలున్నాయి..
- నర్సంపేటలో శ్రేణులకు పార్టీ అండగా ఉంటుంది..
- బీఆర్ఎస్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసుల చర్యలు హద్దులు మీరుతున్నాయని, ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించడం లేదన్నారు. మునిసిపాలిటీలో, గ్రామాలు, తండాల్లో భూతగాదాలలో పోలీసుల జోక్యం పెరిగిందన్నారు. అమాయకులపైన.. ముఖ్యంగా గిరిజనులు, దళితులు, బలహీనవర్గాలపైన పోలీసులు ఏకపక్షంగా కేసులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపైన అక్రమ కేసులు పెడుతున్న ఎస్ఐ, సీఐలను గుర్తించామని, వారికి దీటుగా మండల పార్టీలు పనిచేయాలన్నారు. అవినీతి, అక్రమాలపై రాష్ట్రస్థాయి ఏజెన్సీలను సంప్రదించి న్యాయపోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు, ఎస్సీ ఎస్టీ కమిషన్లతో పాటు హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు చేయడానికి బీఆర్ఎస్ లీగల్‌సెల్ అడ్వకేట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. అధికార పార్టీ నేతలు, పోలీసులు చేస్తున్న అవినీతి, అక్రమాలపై అన్ని ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే పోలీసుస్టేషన్ల ముందు నిరసనలు, ధర్నాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కేసులకు భయపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని కార్య కర్తలకు భరోసా ఇచ్చారు. లగచర్ల బాధితులకు అండగా ఈ నెల 25న మహబూబాబాద్‌లో జరిగే బీఆర్ఎస్ సభకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 29న కేసీఆర్ దీక్షా దివస్‌ను నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గోనె యువరాజు, మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, హింగె మురళీధర్ రావు, బండి రమేశ్, బానోతు సారంగపాణి, బాల్నె వెంకన్న, వెంకట నర్సయ్య, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే అభివృద్ధికి వేగంగా అడుగులు
- కాజీపేట రైల్వేస్టేషన్‌కు డివిజన్ హోదా ఇచ్చేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- కాజీపేటలోనే కోచ్ ఫ్యాక్టరీకి ఏర్పాటుకు ఇప్పటికే అనుమతి
- వేగంగా వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు
- కొత్త రైల్వే మార్గాలకు నిధులు విడుదల చేసిన కేంద్రం
- నూతన రైల్వే కనెక్టివిటీతో పెరగనున్న రవాణా సౌకర్యం



8



ఓరుగల్లు రైలు యమ స్పీడు

రైల్వే మార్గాల పెంపు, ఫ్యాక్టరీల ఏర్పాటు, డివిజన్‌కు రూపకల్పన, వ్యాగన్ల తయారీలతో ఓరుగల్లులో రైల్వే అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇన్నాళ్లు రైల్వే విషయంలో వెనుకబడి ఉన్న ఓరుగల్లుకు ఇక మహర్దశ పట్టనుంది. రైల్వే శాఖకు సంబంధించి పలు అభివృద్ధి పనులను కాజీపేట జంక్షన్ కేంద్రంగా చేయబోతున్నారు. ఇందులో ముఖ్యంగా కాజీపేట రైల్వే డివిజన్‌కు మార్గం సుగమమైంది. విశాఖ జోన్ ఏర్పాటుకాబోతున్న తరుణంలో దక్షిణ మధ్య రైల్వేలో అతి ముఖ్యమైన కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా మార్చబోతున్నారు. ఈ మేరకు అధికారులు హద్దులను నిర్ణయించే పనిలో ఉన్నారు. అలాగే కోచ్ ఫ్యాక్టరీ పనులు వేగంగా జరుగుతున్నాయి. కాజీపేట జంక్షన్‌లో ఇప్పటికే డీజిల్ లోకోషెడ్స్, ఎలక్ట్రిక్ లోకోషెడ్స్ ఉండగా, వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. రూ.521కోట్ల వ్యయంతో 160 ఎకరాల్లో నిర్మితమయ్యే ఈ ఫ్యాక్టరీకి కిందటేడు జూలై 8వ తేదీన ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. యేడాదిలోగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే కొత్త రైల్వే మార్గాల రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ పనులతో కాజీపేట జంక్షన్‌కు మంచిరోజులు రాబోతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్





వరంగల్ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

మహారాష్ట్ర విజయం మోదీ చరిష్మాకు నిదర్శనం

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

మిల్స్‌కాలనీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించడం ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాకు నిదర్శనమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని పురస్కరించుకొని వరంగల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... ప్రధాని మోదీకి ఉన్న పాపులారిటీ ఏ మాత్రం తగ్గలేదని మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు మరోమారు రుజువు చేశాయన్నారు. మోదీ పాలనలో భారత్ అంతర్జాతీయ ఖ్యాతిని గడించిందన్నారు. మహారాష్ట్ర ప్రజలు సరైన నిర్ణయం తీసుకొని బీజేపీ కూటమిని గెలిపించారన్నారు. పేదరికం, అవినీతి, ఉగ్రవాదంలాంటి పీడల నుంచి విముక్తి పొందిన నవభారత నిర్మాణం కోసం యజ్ఞం చేస్తున్న భరతమాత ముద్దుబిడ్డగా మోదీని ఆయన అభివర్ణించారు. సీఎం రేవంత్‌రెడ్డి మోదీపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఇప్పుడు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యవర్గంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, జిల్లా ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల కనుకుంట్ల రంజిత్‌కుమార్, ఎరుకల రఘునారెడ్డి, మాచర్ల దీన్‌దయాళ్, నాయకులు మురళీకృష్ణ, వెంకటేష్, సూరజ్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 24 నవంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

పర్వతగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 1వ తేదీన నిర్వహించే మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ కడారి కుమార్, మండల అధ్యక్షుడు మాడుగుల రాజు పిలుపునిచ్చారు. శనివారం ఈమేరకు మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు చీదురు తిరుపతి, దామెర సారంగపాణి, రజినీకాంత్, చీదురు మల్లేష్, పరుశరాములు, స్వామి, మధు, రాహుల్, ఈశ్వర్, రఘు, యశ్వంత్, రాజు, ఏడెల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను తగలబెడితే నష్టాలు

భూసారం దెబ్బతినే ప్రమాదం

కలియదున్నితే దిగుబడులు పెరిగే అవకాశం

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నాయి, యాసంగి పంటలు సాగుచేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.ఈ క్రమంలో ఖరీఫ్ (వానాకాలం) పంటలను కోసిన తర్వాత వెంటనే వరి కొయ్యలను, మిగిలిన గడ్డిపొల్లును రైతులు పంట పొలాల్లోనే తగులబెడుతున్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల పొలంలో చేరిన కీటకాలు, వ్యాధి కారక సూక్ష్మజీవులను నశింపజేయవచ్చనేది రైతుల అభిప్రాయం.కానీ, వరి కొయ్యలు కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంది. భూసారాన్ని వృద్ధిచేసేందుకు ఉపయోగపడే పదార్థాలు నశించిపోతాయని, వాటిని కాల్చకుండా భూమిలో కలియదున్నితే మంచి ఫలితాలను పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారులు రైతులకు సూచిస్తున్నారు. గత కొన్నేళ్ళుగా రైతులు వరికోత యంత్రాలను వినియోగిస్తున్నారు. వరికోత యంత్రాలు వరి మొక్క మొదలు భాగాన కాకుండా 30 సెంటీ మీటర్ల ఎత్తులో కోయడం వల్ల 50శాతం గడ్డి కొయ్యల రూపంలో పంట అవశేషాలుగా మిగిలిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఎకరాకు రెండు టన్నుల వరి కొయ్యలు, మిగిలిన గడ్డి వ్యర్థాలు మిగిలిపోతాయంటున్నారు. పంట వ్యర్థాలను తగులబెట్టబం వల్ల పర్యావరణంలో పెనుమార్పులు సంభవిస్తాయని, ఒక టన్ను వ్యర్థాలను తగులబెడితే 60 కిలోల కార్బన్ మోనా క్సైడ్‌తో పాటు 1,400 కిలోల కార్బన్ డైఆక్సైడ్ గాలిలోకి విడుదలవుతుందని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొంటు న్నారు. అలాగే సూక్ష్మ ధూళి కణాలు, బూడిద గాలిలో కలవడం వల్ల వాయు కాలుష్యం పెరడంతోపాటు భూసారం క్షీణిస్తుందంటున్నారు. సూక్ష్మజీవుల సంఖ్య తగ్గి నేల పొరల్లో తేమ శాతం ఆవిరయి దిగుబడులపై ప్రభావం చూపుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



వరికొయ్యలు తగులబడి పొలంలో వ్యాపిస్తున్న మంటలు(ఫైల్)

కలియ దున్నితే లాభాలు

ప్రతీ టన్ను వరిగడ్డి పెరగడానికి భూమి నుంచి 6.2 కిలోల నత్రజని, 1.1కిలోల భాస్వరం, 18.9కిలోల పొటాష్, కొద్దిమోతాదులో సూక్ష్మపోషకాలను తీసుకుంటుంది. వరికొయ్యలను భూమిలో కలియదున్నడం వల్ల ఈ పోషకాలన్నీ తిరిగి నేలను చేరుతాయి, పంట వ్యర్థాలను ముడిపదార్థాలుగా వాడుకుని కంపోస్టు పద్ధతి ద్వారా సేంద్రియ ఎరువులను రైతులు తయారు చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.

కొయ్యలను కలియదున్నాలి

మెండు అశోక్, ఏఈవో, నర్సంపేట



వరిపంటను కోసిన వెంటనే వరి కొయ్యలను పంట పొలంలో కలియదున్నాలి. కలియదున్నితే వరికొయ్యలు మట్టితో కప్పబడి కుళ్ళిపోయే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇలా చేయడం వల్ల నేలలో పగుళ్ళు రావడం, తేమ ఆవిరికావడం తగ్గి వర్షపు నీరు నేలలోకి ఇంకి పోయి నేలకోతను అరికట్టవచ్చు. నాట్లు వేయడానికి ముందు దమ్ముచేసే టప్పుడు ఎకరాకు 50కిలోల సూపర్‌ఫాస్ఫేట్ వేయడం వల్ల కొయ్యలు కుళ్ళి సేంద్రియ పదార్థాలు మారి దిగుబడి పెరుగుతుంది. వరి కొయ్యలు కాల్చవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

సమష్టి కృషితో సైన్స్ ఫెయిర్‌ను

విజయవంతం చేయాలి

• సన్నాహక కమిటీ సమావేశంలో డీఈవో జ్ఞానేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి జ్ఞానేశ్వర్

నర్సంపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహేశ్వరంలోని శివాని పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 26 నుంచి 28వ తేది వరకు జరగనున్న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను సన్నాహక కమిటీ సభ్యులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ అన్నారు. శివాని పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ కోసం ఏర్పాటు చేసిన 17 కమిటీల కన్వీనర్లు, కో-కన్వీనర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. సైన్స్ ఫెయిర్‌లో తమ ఆవిష్కరణ, సైన్స్ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించబోయే విద్యార్థులు ఈ నెల 26న ఉదయం ఎగ్జిబిట్‌లతో చేరుకొని, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి వీక్షించడానికి వచ్చే పాఠశాలల విద్యార్థులకు, శాస్త్ర అభిమానులకు సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలను బాలశాస్త్రవేత్తలు వివరిస్తారని, 28న సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు కామారెడ్డి జిల్లాలో డిసెంబరు రెండవ వారంలో జరిగే అవకాశం ఉందన్నారు. జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవడంలో సైన్స్, గణితం ఎంతో పాత్రను అభినందించడం, పర్యావరణ సమస్యలు, ఆందోళనలపై అవగాహన కల్పించడం, విద్యార్థులను తగు విధంగా ప్రేరేపించడం, వాటి నివారణ, ఉపశమనానికి సంబంధించి వినూత్న ఆలోచనలను రూపొందించడమే లక్ష్యంగా బాల వైజ్ఞానిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, ఏఎంవో సుజన్‌తేజ, డీసీఈబీ కార్యదర్శి గారె కృష్ణమూర్తి, ఎంఈవో కొర్ర సారయ్య, శివాని స్కూల్ చైర్మన్ సుబ్బారావు, డైరెక్టర్ రాహుల్ పాల్గొన్నారు. ఇదిలావుండగా నర్సంపేట పట్టణంలోని సర్వాపురం ఎంపీపీఎస్ పాఠశాలను డీఈవో మామిడి జ్ఞానేశ్వర్, ఏఎంవో సుజన్‌తేజ, ఎంఈవో సారయ్యలు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల రిజిష్టర్, పిల్లల రిజిష్టర్‌లను పరిశీలించారు. పాఠశాల భూమిని పరిరక్షించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యా సామర్థ్యాన్ని పెంచాలి



విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సుజన్‌తేజ

గీసుగొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ సూచించారు. శనివారం ఆయన వంచనగిరి మోడల్‌స్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల, మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించకుంటే ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు. టెన్త్ విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎస్ఐ 1 ఫలితాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా బోధనలో అలసత్వం చేస్తే చర్యలు

నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనల్లో అలసత్వం చేసినా, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు లోపించినా, మెనూ ప్రకారం అందించకున్నా ఉపాధ్యాయులపైన, భోజన ఏజెన్సీలపైన కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి కె.అనురాధ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని ముదిగొండ, దీక్షకుంట, సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించిన అనంతరం భోజనం విద్యార్థులకు మెను ప్రకారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రాజ్‌కుమార్ గుండ్రపల్లి, పెద్ద కొర్పోలు, మడిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌లను, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. తహసీల్దార్ విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మండలంలోని తోపనపల్లి పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలు అడిగారు. కార్యక్రమంలో మండల ఏవో నాగరాజు, ఆర్ఐ నరేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్థవంతంగా బోధించాలి

నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే విధంగా, అర్థవంతంగా చదువును ఉపాధ్యాయులు బోధించాలని నల్లబెల్లి తహసీల్దార్ ముప్పు కృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో తహసీల్దార్ కృష్ణ తనిఖీ చేశారు. ముఖ్యంగా విద్యార్థులు తినే వంటను పరిశీలించారు. నాణ్యత గల భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు వేడి నీటిని అందించాలన్నారు. విద్యాలయాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వో సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వసతి గృహాల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

సంగెం (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో, వసతి గృహాల్లో నిల్వ ఉన్న బియ్యం, కూరగాయలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినందున విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాసర్ల రవీందర్, నాయాబ్ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం మెను ప్రకారం అందించాలి

దుగ్గొండి (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనం మెను ప్రకారం విద్యార్థులకు అందించాలని ఎంపీడీవో అరుంధతి అన్నారు. మండలంలోని తొగర్రాయి, నాచినపల్లి, పొనకల్ గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సందర్శించి పరిశీలన చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాలు, రాగి జావ పంపిణీ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టికాహారం పంపిణీ పరిశీలన చేశారు. తాగు నీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యాలను తనిఖీ చేశారు.

బీజేపీ నాయకుల సంబరాలు

నర్సంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో భారతీయ జనతా పార్టీ విజయఢంకా మోగిస్తుండడంతో నర్సంపేట పట్టణంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోగులరాణా ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీనాయకులు శనివారం సాయంత్రం సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీచేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రదేశాలకు దీటుగా ప్రధాని నరేంద్రమోడి అభివృద్ధిపథంలో ముందుకు తీసుకువెలుతున్నారని ఆయన అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయపార్టీగా బీజేపీ అవతరించిందన్నారు.మహారాష్ట్రంలో బీజేపీ విజయం మోడీ చేస్తున్న అబివృద్ధికి నిదర్శనమని ఆయన అన్నారు. కార్య క్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రాంచంద్రరెడ్డి, ఓబీసీమోర్చా రా ష్ట్ర ప్రధానకార్యదర్శి గడ్డం ఆంజనేయులు, ఎస్టీ మోర్చాజిల్లా అధ్యక్షుడు బానోతు వీరన్నతోపాటు బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సంపేటలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం నెక్కొండలోని అంబేద్కర్ సెంటర్‌లో బీజేపీ నాయకులు టపాసులను పెల్చి మిఠాయిలను పంపిణి చేశారు. ఈ విజయం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మచ్చలేని పాలనకు నిదర్శనమన్ని మండల బీజేపీ అధ్యక్షుడు నాయిని అశోక్ అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి లక్ష్మయ్య దామచర్ల రామారావు, సింగారపు సురేష్, రాజగోపాల్, సతీష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

జల్లి రైతు వేదికను పట్టించుకోరా..

చెత్తా, ముళ్లపొదలతో అపరిశుభ్రంగా మారిన వేదిక ప్రాగంణం



చెత్తా, ముళ్లపొదలతో రైతు వేదిక ప్రాంగణం

చెన్నారావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జల్లి గ్రామం లోని రైతు వేదిక ప్రాగంణం చెత్తాచెదారంతో మారిందని గ్రామస్థులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రైతులకు సలహాలు. సమావేశాలు నిర్వహించడానికి రూ 25లక్షలతో నిర్మాణం చేసిన రైతు వేదిక ప్రాంగణాన్ని పట్టించుకోనేవారు లేక, చెత్తా చెదారంతో ఉందని, అలాగే పిచ్చి మొక్కలు మొలచి రైతు వేదిక ప్రాంగణం పరసరాల ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి మొక్కలతో పరిసరాలకు రైతులు, గ్రామస్థులు రావటడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రైతు వేదిక చుట్టూ శుభ్రం చేయించాలని పలువురు రైతులు. గ్రామస్థులు కోరుతున్నారు.

ఉద్యమకారుల ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా గవర్‌సింగ్



గవర్‌సింగ్

నర్సంపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక మండల కమిటీ అధ్యక్షుడిగా కొర్ర గవర్‌సింగ్ ఎంపిక చేస్తూ శనివారం రాష్ట్ర అధ్యక్షుడు పంజాల వెంకట్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గవర్‌సింగ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశానన్నారు. తనను ఐక్యవేదిక మండల అధ్యక్షునిగా నియామకం చేసిన వెంకట్‌గౌడ్, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలన్నారు.

ఐకేపీ వరి ధాన్యం కోనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

నల్లబెల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిండ్ల వీరయ్యపల్లి గ్రామంలో ఐకేపీ వరి ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని నర్సం పేట వ్యవసాయ మా ర్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీ త మద్ధతు ధర మేరకు మాత్రమే ఐకేపీ రైతుల వద్ద వరి ధాన్యం కోనుగోలు చేయాలన్నారు. అలాగే వరి ధాన్యం తూకం వద్ద ఏలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. వరి ధాన్యం అమ్మే రైతులను ఏలాంటి ఇబ్బంది లకు గురి చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఏపీఎం సునీత, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, చెల్పూరి జ్యోతి, వైనాల అశోక్, పురుషోత్తంసురేష్, ఏడాకుల సంపత్‌రెడ్డి, బత్తిని మహేష్, ఫూల్‌సింగ్, జెట్టి రామ్మూర్తి, అజ్మీర తిరుపతి, చిట్యాల ఉపేందర్‌రెడ్డి, గోనే శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటుపడాలి

వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్

వర్ధన్నపేట రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్ అన్నారు. శనివారం మండలంలోని కట్ర్యాల గ్రామంలోని జీపీ ఆవరణలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత కొంతకాలంగా జిల్లా పరిషత్ పాఠశాలకు దారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారు. ఈ మేరకు కట్ర్యాల నుంచి కొత్తపెల్లి వైపుకు వెళ్లే దారిలో కొంత భూమిని పాఠశాల దారి నిమిత్తం నాంపెల్లి మల్లేషం తన తల్లిదండ్రులు నాంపెల్లి వెంకటమ్మ వీరమల్లుల జ్ఞాపకార్థం అందించారు. దీంతో గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ విజయ్ సాగర్ మల్లేషాన్ని సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ఊరు మన బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి బుస్స శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ కట్ట వెంకటయ్య, నాయకులు గుజ్జ రవీందర్‌రెడ్డి, నాంపెల్లి రవీందర్, బండారి సతీష్, ఎండీ అక్బర్, దొమ్మటి రాము, ముత్యాల కొమ్మాలు, సునిత, సమ్మయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.



కట్ర్యాలలో పాఠశాలకు దారి అందించిన మల్లేశాన్ని అభినందిస్తున్న తహసీల్దార్ విజయ్ సాగర్

న్యూస్ బాక్స్

ఓటరు నమోదులో జాగ్రత్తలు పాటించాలి



కట్ర్యాలలో బీఎల్‌వోలకు సూచనలుచేస్తున్న ఎన్నికల అబ్జర్వర్ ఆయేషా

వర్ధన్నపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతీఒక్కరు జాగ్రత్తలు పాటించాలని ఎన్నికల అబ్జర్వర్ ఆయేషా మస్రత్ ఖనం సూచించారు. శనివారం మండలంలోని కట్ర్యాలలో సంక్షిప్త సవరణ-2025లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా 228,229 పోలింగ్ బూతుల్లో నమోదవుతున్న కొత్త ఓటర్ల ప్రక్రియను తెలుసుకుని, స్వయంగా నూతన ఓటర్లతో మాట్లాడారు. బీఎల్‌వో రిజిస్టర్‌ను తనిఖీచేసి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైందని, దానిని నిర్లక్ష్యం గా చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్ సాగర్, ఆర్ఐ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



రాయబోసు



హర్షియ

నర్సంపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ నర్సంపేట మండల నూతన కమిటీని శనివారం పట్టణంలో జరిగిన మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎం.డి. రాయబోసు, ప్రధాన కార్యదర్శి పి.హర్షియ, కోశాధికారి బి. అర్జున్‌సాగర్, ఉపాధ్యక్షులుగా సామల ఇంద్రాణి, పి.కుమార స్వామి, కార్యదర్శులుగా ఇ.చంద్రశేఖర్, వి.రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతతూ మండలంలోని ఉపాధ్యాయులకు నిరంతరం అందుబాటులో ఉంటామని, సమస్యల పరిష్కారానికి తోడ్పాటునందిస్తామన్నారు. ఎన్నికల పరిశీలకులుగా కందగట్ల రమేష్ వ్యవహరించారు.

టీయూఎఫ్ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నెక్కొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు ఈ నెల 27,28 తేదిలల్లో నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ కోరారు. శనివారం నెక్కొండలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పాదయాత్ర వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నుంచి వేములవాడ వరకూ నిర్వహించే పాదయాత్రలో మలిదశ ఉద్యమ కారులు అధిక సంఖ్యలో పాల్గొన్ని ఉద్యమ కారుల సత్తాచాటలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అల్లి యాదగిరి, మండల అధ్యక్షుడు కొత్త సంపత్‌రెడ్డి, నర్సంపేట డివిజన్ అధికార ప్రతినిది బొడ్డుపల్లి అజయ్‌కుమార్, మహిళ అధ్యక్షురాలు శాడ అనితారెడ్డి, అల్లి ఉమాదేవి, రమ్యసుధ, శోభ, విజయ, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తుబొత్తు ఆటపై పోలీసుల దాడి

నర్సంపేట టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో చిత్తుబొత్తు ఆడుతున్నారన్న సమాచారంతో టౌన్ సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. చిత్తుబొత్తు ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 7 బైక్‌లు, రూ.1600 నగదు స్వాదీనం చేసుకున్నామన్నారు.

బస్సులో మరిచిపోయిన మొబైల్ అందజేత



హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికుడికి మొబైల్ అందజేస్తున్న దృశ్యం

నర్సంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ నుంచి హనుమకొండకు వస్తున్న నర్సంపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరి బస్సు (టీఎస్ 03 జడ్0455)లో హైదరాబాద్‌కు చెందిన ఎం.నగేశ్ అనే ప్ర యాణికుడు తన రూ.32 వేల విలువైన మొబైల్‌ఫోన్ మరిచిపోయి మధ్యలోనే దిగిపోయాడు. గమనించిన బస్సు డ్రైవర్ హరిసింగ్ వెంటనే నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి దృష్టికి ప్రయాణికుడు మొబైల్‌ఫోన్ మరిచిపోయిన విషయాన్ని తీసుకెళ్ళాడు. స్పందించిన మేనేజర్ ఈ విషయాన్ని హన్మకొండ బస్టాండ్‌లోని కంట్రోలర్‌కు తెలిపారు. హన్మకొండ బస్టాండ్‌లో స్టేషన్ మేనేజర్ ఆధ్వర్యంలో బస్సు డ్రైవర్ హరిసింగ్ అక్కడ విధులు నిర్వహిస్తున్న కండక్టర్ హేమలత, కంట్రోలర్ ప్రయాణికుడు నగేశ్‌కు మొబైల్‌ను అందజేశారు. మొబైల్‌ను అందజేసిన కండక్టర్ హరిసింగ్, నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మికి ప్రయాణికుడు నగేశ్ కృతజ్ఞలుతెలిపాడు.ప్రయాణికుడికి మొబైల్ అందజేసి నిజాయితీని చాటుకున్న కండక్టర్ హరిసింగ్‌ను డిపోమేనేజర్ అభినందించారు.

గౌడన్నలకు 'కాటమయ్య కిట్ల' రక్షణ



కాటమయ్య కిట్ (ఫైల్)

వర్ధన్నపేట, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : కుల వృత్తులను బలోపేతం చేస్తూ ప్రమాదాల బారి నుంచి వారిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్య లు చేపట్టింది. అందులో భాగంగా గీత కార్మికులకు కాటమయ్య పేరుతో సేఫ్టీ మోకులు పంపిణీ చేస్తుంది. వారి రక్షణ కోసం నూతన కిట్లును అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో పలు ప్రాంతాల్లో గీత కార్మికులు తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందిన సందర్భాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

తాటిచెట్టు ఎక్కుతున్న సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు కిట్లను పంపిణీ చేస్తున్నారు. చెట్టు ఎక్కిన సమయంలో జారికింద పడకుండా ఉండేందుకు ధృఢమైన బెల్టుతోపాటు మూడు క్లిప్పులు ఉంటాయి. సుమారు 300 కిలోల బరువు మోసే విధంగా కిట్టును రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. దీని విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని ప్రభుత్వం గీత కార్మికులకు ఉచితంగా పంపిణీ చేస్తుందని ఎక్సైజ్ అధికారులు వివరించారు. ఇటీవల వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

స్వరూప, ఎక్సైజ్ సీఐ, వర్ధన్నపేట

తాటిచెట్టు ఎక్కిన సమయంలో ప్రమాదాల బారినుంచి కాపాడుకునేందుకు అందించే కాటమయ్య రక్షణ కిట్లను గీత కార్మికులు వినియోగించుకోవాలి. ఇటీవలే కిట్ వినియోగంపై గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం.